# "లడ్డూ"నెయ్యి "కల్తీ" బాగోతం

# ఏం జరగనుంది!?

## -వడ్డీకాసులవానికే టిటిడి గత పెద్దల శఠగోపం!!

## -అన్నివర్గాల్లో తీవ్ర చర్చ



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడారనే ఆధారాలు బలం చేకూరడంతో ఇప్పుడు ఈ బాగోతంపై ఏం జరగనుందనే?చర్చ టిటిడి వర్గాల్లోనేగాక రాయలసీమ ప్రాంత ప్రజల్లో, వెంకన్న భక్తుల్లో కుదిపేస్తోంది. దేవదేవుని పవిత్ర ప్రసాదం తయారీలో ఇంతటి దారుణానికి ఒడిగట్టినా పాలక పెద్దలు, అప్పటి టిటిడి అధికారులు నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యమేమిటనేది దుమారం రేపుతోంది. తాజాగా లడ్డూలకు కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు,చేపనూనె,ఇతర ఆహారపదార్థాలతో తీసిన నూనె వాడారనే ఆధారాల రిపోర్టు టిటిడికి చేరడంతో ఈ కల్తీకి సాక్షాత్తు వేంకటేశ్వరుడే సాక్ష్యంగా నిలిచాడనేది భక్తుల్లో వ్యక్తమవుతున్న విశ్వాసం. టిటిడి చరిత్రలోనే ఇంతవరకు కనీవినీ ఎరుగని రీతిలో లడ్డూల తయారీకి జంతువుల కొవ్వునూనె వాడటమనేది పెద్ద పాపమేనని భక్తులు అంటున్నారు. మరీ ఈ విషయంలో తప్పిదాలకు పాల్పడిన పెద్దలు ఎవరు!?పాలకమండలి సభ్యులా, ఛైర్మన్, టిటిడిలో సర్వంతానై చక్రం తిప్పిన అధికారా??అనేది జనంలో చర్చకు దారితీసింది. లడ్డూల కల్తీ నెయ్యి వాడకంపై సామాన్యజనం నుండి స్వామివారి భక్తులు, చివరకు సినీమారంగం వాళ్ళు కేంద్రం పెద్దలు స్పందించారంటే హిందువుల మనోభావాలు ఏమాత్రం అనేది అర్థమవుతుంది. కాగా ప్రభుత్వం,ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలపై వైసిపి నేతలు హైకోర్టును ఆశ్రయించారంటే వారిలో కల్తీ భయం వెంటాడుతోందనేది టిటిడి ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కేంద్రమంత్రులు అమిత్‌షా, స్పందన ఊహించనిది. దేవదేవుడు హిందు భక్తుల ఆరాధ్యవైదంగా తిరుమల వేంకటేశ్వరుడు ఖ్యాతిచెందాడు. అంతటి భక్తివిశ్వాసాలు, పవిత్రత ఉన్న దేవుడి ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు వాడటమంటే మాటల్లో చెప్పలేనిదని భక్తులు అంటున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాలు డిమాండ్ పెరిగింది. గత టిటిడి అధికారులు, బోర్డు తప్పిదాలకు సమాధానం చెప్పాలని అదికారనేతలు పట్టుబడుతున్నారు. ఇంత రాద్ధాంతం జరుగుతున్నా మఠాధిపతులు, పీఠాధిపతులు నోరుమెదపకపోవడం మరీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏకంగా ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగి ,టిటిడి అధికారులపై అలిగి ఇప్పుడు కల్తీనెయ్యిపై స్పందించడం విశేషం. లడ్డూ కల్తీ వివాదం హైకోర్టుకు చేరింది. ప్రసాదం తయారీలో కల్తీ,జంతువుల కొవ్వు వాడారనే విషప్రచారం ఆపాలని వైసిపి కోర్టుమెట్టెక్కింది. అయితే న్యాయస్థానం దీనిపై జోక్యంచేసుకునేందుకు ఐదురోజులు తరువాత విచారణ చేస్తామంది .బాధ్యులైన అందరిపై పలు సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేయాలని ఓ న్యాయవాది కోరుతున్నారు. మరీ ఈ వివాదం తదుపరి ఏం జరుగనుందనేది మాత్రం పెద్ద ఉత్కంఠగా మారింది.

## టిటిడిలో ల్యాబ్‌లేకపోవడమే

# నాణ్యత లోపానికి కారణం

### -ఆవునెయ్యి వినియోగంతో నాణ్యత లడ్డూలు

### -నైవేద్యప్రసాదాల పవిత్రతను నిర్ధారిస్తాం

### -టిటిడి ఈఓ శ్యామలరావు

తిరుమల, సెప్టెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:



స్వచ్ఛమైన ఆవునెయ్యి ఉపయోగించి దేవదేవునికి ఎక్కువగా నైవేద్యంగా సమర్పించే లడ్డూప్రసాదాలను తయారుచేస్తున్నామని, దీనివల్ల పవిత్రతను టిటిడి నిర్ధారిస్తుందని ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా భక్తులు వేంకటేశ్వరస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకోవడంతో బాటు లడ్డూప్రసాదాలను స్వీకరిస్తున్నారన్నారు. దీని పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లడ్డూల తయారీలో కల్తీనెయ్యిపై వస్తున్న ఆరోపణలు వాస్తవమేనని,ఇందులో జంతువుల కొవ్వు, ఇతరత్రా పదార్థాలతో తీసిన నూనె వినియోగించారని నిర్ధారణ చేశామని ఈఓ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి తిరుమల అన్నమయ్యభవనంలో మీడియాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. లడ్డూల నెయ్యి కల్తీపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. లడ్డూప్రసాదంలో నాణ్యత,రుచి ఉండేలా చూడాలని మూడునెలల ముందే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పారన్నారు. స్వచ్ఛమైన ఆవునెయ్యిని ఉపయోగించడం వల్ల ఇది భక్తుల మనోభావాలు పరిగణనలోనికి తీసుకుని రుచికరంగా తయారుచేయవచ్చున్నారు. లడ్డూల నాణ్యత రుచి మెరుగుపరచడంపై తాము మూడు నెలలుగా దృష్టి సారించామన్నారు. నాణ్యత తక్కువగా ఉందని యాత్రికుల నుండి అభిప్రా యాలను స్వీకరించిన తరువాత పోటు కార్మికులతో అభిప్రాయాలు తీసుకున్నామ న్నారు.మొదటిసారిగి టిటిడి కల్తీపరీక్ష కోసం నెయ్యిని బయటల్యాబ్‌కు పంపామన్నారు. ఎన్‌డిడిబి నుండి అందిన నివేదికల ఆధారంగా నెయ్యి కల్తీ,జంతువుల కొవ్వు నూనె వినియోగించారని తేల్చారు. ఇక శ్రీవారి ప్రసాదాల తయారీకి ఉపయోగించే ఆవు ఆధారిత ఉత్పత్తులను టిటిడి తాత్కాలికంగా నిలిపివేసిందన్నారు. అన్నప్రసాదాల నాణ్యత,రుచి పైభక్తుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఇందుకోసం టిటిడి నిపుణులతో కమిటీ వేసి నాణ్యతలో లోపాలున్నాయని తేల్చిందన్నారు.దీంతో గోఆదారిత ఆహారపదార్థాల ఉత్పత్తులు తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

### సిఎం చంద్రబాబు టిటిడి ప్రక్షాళన చేయడం శుభపరిణామం

#### తిరుమల ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు



తిరుమల,సెప్టెంబర్ 20ప్రభాతవార్తప్రతినిధి:

గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వ, గత టిటిడి పాలకమండలి ఛైర్మన్ల తప్పిదాలు, అక్రమాలతో తిరుమల పవిత్రత దెబ్బతిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక టిటిడిలో ప్రక్షాళన మొదలైందని తిరుమల ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు డాక్టర్ ఏవి రమణదీక్షితులు సంచలన వ్యాఖ్యలు చేశారు. లడ్డూల నాణ్యత లేదని గత ఐదేళ్ళలో అనేక దఫాలుగా భక్తులు ఫిర్యాదులు చేశారని, గత వైసిపి ప్రభుత్వం, ధర్మకర్తలమండలి కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. నెయ్యికల్తీ అయ్యిందని నిర్ధా రణ కావడంతో శుక్రవారం తిరుమలలోని తననివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బంగారుపాళ్యంలో ప్రజా దర్బార్

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:

బంగారుపాళ్యంలోని ఎస్ఎల్‌వి కళ్యాణ మండపంలో శుక్రవారం మంత్రి నారా లోకేష్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరించి మంత్రి నారా లోకేష్ తాను ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుని మంత్రి నారా లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు.



ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.

# హామీల అమలులో వెనకడుగు వేయం

### - అభివృద్ధి చేసి చిత్తూరు ప్రజల రుణం తీర్చుకుంటా

### - బంగారుపాళ్యం సిహెచ్‌సిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్



బంగారుపాళ్యం సిహెచ్‌సిలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.

చిత్తూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:

యువగళం పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు వేసే ప్రసక్తే వుండదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ నిర్వమించిన యువగళం పాదయాత్ర వంద కిలోమీటర్లు బంగారుపాళ్యంలో పూర్తి చేసుకోవడంతో అప్పట్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం మంత్రి నారా లోకేష్ రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రానున్న ఐదేళ్ళలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లా ప్రజానీకం తనపై చూపిన అభిమానంను జీవితంలో మరువలేనన్నారు. గత ఏడాది జనవరి 27న కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుండి తాను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కల్గించిందన్నారు. 11 ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 2,200 గ్రామాల మీదుగా 3,132 కిమీ యువగళం పాదయాత్ర సాగిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరు చేయని విధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు కవర్ చేస్తూ 45 రోజుల పాటు 577 కిమీ మేరకు యువగళం పాదయాత్ర కొనసాగి రికార్డు సృష్టించిందన్నారు. యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంలో ఎంత అరాచకం సృష్టించారో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రభుత్వం జిఓనెం.1 జారీ చేసి బంగారుపాళ్యంలో తన ప్రచార రథంను పోలీసులు అడ్డుకుని తన గొంతునొక్కాలను విఫలయత్నం చేశారు. యువగళం అనేది తన ఒక్క గొంతు కాదని 5 కోట్ల ప్రజల గొంతుక అని అప్పటి ప్రభుత్వానికి తర్వాత అర్థమైందన్నారు. బంగారుపాళ్యంలో వంద కిమీ పాదయాత్ర పూర్తి చేసుకోవడంతో 3 ఫిబ్రవరి 2023న తాను తొలి మైలురాయిని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇక్కడి ప్రజలు డయాలసిస్ కేంద్రం అవసరమని చెప్పడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చానన్నారు. పాదయాత్ర సమయంలో తనపై ప్రజలు తనపై చూపిన అభిమానంకు రుణం తీర్చుకోవడానికి ప్రస్తుతం మంత్రిగా మీ ముందుకు వచ్చి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ బంగారుపాళ్యం సిహెచ్‌సిలో కొత్తగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించారు. అలాగే ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆపై మంత్రి నారా లోకేష్ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎన్‌పి ధరణి, ఎన్‌పి విక్రమ్, స్థానిక సర్పంచ్ ఆముద, ఉప సర్పంచ్ కమలనాధరెడ్డి, నాయకులు మాజీ జడ్పీటిసీ కళావతి మహేంద్ర, తెలుగుయువత రమేష్, కవి, జాకీర్, లోకనాధనాయుడు, హేమచంద్ర, ఎంపిడిఓ శివశంకర్, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# గణనాధునికి ఘనంగా విమానోత్సవం





పుష్పపల్లకి సేవకు విదేశి, స్వదేశిజాతి పుష్పాలతో సిద్ధం చేస్తున్న అలంకరణలు

కాణిపాకం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుడు విమానవాహనంపై కాణిపాకం గ్రామ పురవీదుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమానికి ఐరాలకు చెందిన కీ॥శే॥ కె.రామకృష్ణ పిళ్ళె కుటుంబీకులు, దేవస్థానం వారు ఉభయదారులుగా వ్యవహ రించారు. వీరు పగలు మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్దిబుద్ది సమే తుడైన గణనాధుని ఉత్సవమూర్తులను వుంచి మరోమారు వేద పండితుల మం త్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేసి దూదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకరించిన విమానవాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పుర వీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి,సూపరెం డెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

#### పుష్పపల్లకిసేవకు భారీ ఏర్పాట్లు

కాణిపాకం దేవస్ధానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరుగనున్న పుష్పపల్లకిసేవకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఉత్సవరోజులలో పుష్పపల్లకిసేవ ఒకటి. ఈఉత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఈసందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పుష్పపల్లకి సేవకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశముండడంతో వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. పుష్పపల్లకి సేవకు తరలివచ్చే భక్తులందరికి స్వామి దర్శనం కల్పించేందుకు ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేశారు. అలాగే భక్తులకు కావలసిన స్వామివారి ప్రసాదాలను అందించడానికి కావలసిన లడ్డూ, వడ ప్రసాదాలను సిద్ధంగా వుంచినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దీనితో పాటు భక్తుల కాలక్షేపం నిమిత్త పేరొందిన ప్రముఖ కళాకారులచే స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## పోలేరమ్మ జాతరలో సామాన్య భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త

ఈ నెల 25, 26 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామ శక్తి పోలేరమ్మ జాతరలో అమ్మవారి దర్శనానికి సామాన్య భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే ఒక కళ్యాణ మండలంలో పోలేరమ్మ జాతర సమన్వయ కమిటీ సమావేశంలో జెసి శుభం బన్సల్, ఎమ్మెల్యే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 500 రూపాయిలు, 100 రూపాయిలు టికెట్ల కొరకు క్యూలైన్లు ఉంటాయని తెలిపారు. విఐపి ఉచిత క్యూలైన్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

## మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు తోడ్పడండి

### కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త

మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు తోడ్పడండని కమిషనర్ ఎన్. మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ 2024 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వైకుంఠపురం ఆర్చి రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త కుప్పలను తొలగించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని అన్నారు. మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షిస్తేనే భావితరాలకు మనం మంచి వాతావరణాన్ని అందించిన వారమవుతామని అన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## 9 అంశాలపై ఎస్వీయూ పాలకమండలి ఆమోద ముద్ర

తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:

శ్రీ వెంకటేశ్వర వర్సిటీలోని ఉపకులపతి కార్యాలయంలో పాలకమండలి సమావేశం జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షులుగా ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు వ్యవహరించారు.ప్రధాన నిర్ణయాలు యస్వాయూలోని మైక్రో బయాలజీ బిల్డింగ్ నిర్మాణానికి 1.02 కోట్లు నిధులకు ఏకగ్రీవ ఆమోద లభించింది.యస్వీయూలోని ఫార్మాసి బిల్డింగ్ నిర్మాణానికి 2.8 కోట్ల రూపాయలకు పాలకమండలి ఆమోదం లభించింది.నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలాక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడానికి పాలకమండల ఆమోదు లభించింది.శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుభందంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో విద్యార్థులు టాయిలెట్స్ కోసం 76.80 లక్షల నిధులు ఇవ్వడానికి పాలకమండలి ఆమోదం లభించింది.యస్వాయూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లోని నాలుగు అంతస్తుల టాయిలెట్ల కోసం 85 లక్షల రూపాయలు మంజూరుకు పాలకబండలి ఇమోదం.శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలంలోని ఇంజనీరింగ్ డిపార్టె మ్మెంట్ ప్రమోషన్ల కొరకు పాలకమండలి ఆమోదం ఇచ్చింది.యస్వీయూ దూరవిద్యా విభాగంలో స్టడీ మెటీరియల్ కు సంబంధించిన ప్రింటింగ్ పెండింగ్ బిల్లులకు పాలకమండలి ఆమోదం. యస్వీయూకు అనుబంధంగా ఉన్న మూడు టిటిడి అనుబంధ కళాశాలలకు నగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు,చిత్తూరులోని పివికేఎన్ కళాశాలకు అటానమస్ సౌకర్యం కల్పించడానికి పాలకమండలి ఆమోదం. యస్వీయూ దూర విద్య విభాగం పేరున ఇక నుంచి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ లెర్నింగ్ గా మార్చబడింది.దూర విద్యలో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆన్లైన్ ద్వారా అందజేయబడేటట్లు నిర్ణయించబడింది.ఈ సమావేశానికి ఉన్నత విద్యామండలి ఇంచార్జ్ ఛైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు.యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం భూపతి నాయుడు పాలకమండలి సభ్యులైన ఆచార్య సుగుణమ్మ,ఆచార్య పద్మనాభం.ఆచార్య కోల మంజుల డాక్టర్ మొహిద్దిన్ బాష,నారాయణ బాబు హాజరయ్యారు.ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్,ఆచార్య సుమికిరణ్,ప్రభుత్వ ఆర్థిక శాఖ విభాగం నుండి డిప్యూటీ సెక్రటరీ ఆదినారాయణ ఆన్లైన్లో హాజరయ్యారు.

# పేదల కడుపు నింపటానికే అన్నా క్యాంటిన్లు

### శ్రీకాళహస్తిలో రెండు చోట్ల పునఃప్రారంభం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

నిరుపేదల కడుపు నింపటానికి తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'అన్నా కాంటిన్లను' గత వైకాపా ప్రభుత్వం నిరంకుశ వైఖరితో మూసివేసినారని నేడు పేదల ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మళ్ళీ అన్నా క్యాంటిన్లను పునఃప్రారంభిస్తున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని స్వర్ణముఖి నది ఒడ్డున, అలాగే ఆర్‌టిసి బస్టాండ్,ఏరియా ఆసుపత్రిల మధ్య మరో అన్నా క్యాంటిన్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రభుత్వం వచ్చింది.వారి ఆకలి బాధలు, సమస్యల పరిష్కారానికి మార్గం వచ్చిందన్నారు.శ్రీకాళహస్తి పట్టణంలో నిత్యం కార్మికులు పనులకు వెళ్ళటానికి గుమిగూడి ఉంటారన్నారు.వారి ఆకలి తీర్చటానికి ప్రభుత్వం, గతంలో మంత్రి, శాసనసభ్యుడుగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రెండు చోట్ల ఏర్పాటు చేసారన్నారు. కానీ వాటిని వైకాపా ప్రభుత్వం నిరంకుశంగా మూసివేసారన్నారు. మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిందని నిరుపేదలకు శాశ్వత లబ్ధిని చేకూర్చే పథకాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వంద రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు.పంచాయతీరాజ్ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఇక వ్యవసాయ ప్రాధాన్య కల్గిన శ్రీకాళహస్తిలో చెరువుల బాగుకు గత ప్రభుత్వం పైసా విదిల్చలేదన్నారు. కానీ తాము వంద రోజుల్లో రూ. 2కోట్లతో పనులు చేయటానికి చర్యలు తీసుకున్నామని వివరించారు.

#### మరో రెండు క్యాంటిన్లు:

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఓ వైపు కార్మికుల ఆకలి దప్పులు కారుచౌకగా తీర్చటమే కాకుండా భక్తుల సౌకర్యార్థం మరో రెండు క్యాంటిన్లను ప్రారంభించటానికి ప్రయత్నిస్తామని ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి అన్నారు.ఓ క్యాంటిన్ పానగల్ వద్ద మరో క్యాంటిన్ దేవస్థానం ఆర్‌టిసి బస్టాండు సమీపంలో ఏర్పాటు చేస్తే శివభక్తులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నట్లు వివరించారు.ఈ ప్రారంభోత్సవాల్లో ఎంఎల్ఏతో పాటు రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మెన్ చెంచయ్యనాయుడు,కాసరం రమేష్, గాలి మురళినాయుడు మాజీ కౌన్సిలర్లు దుర్గా ప్రసాద్,బషీర్,సుప్రజ,బి.రేణుకాదేవి, బాలు,డిల్లిబాబు,వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జయప్రదం చేయాలి



రామకుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

మండలంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంను జయప్రదం చేయాలని రాష్ట్ర నేత మునస్వామి, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం వంద రోజుల పాలనపై గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. నేతలు పత్ర నారాయణ, నరసింహులు, చలపతి, కృష్ణానాయక్, కామరాజు నాయక్, రఫీ, విశ్వనాథ్, మనోహర్, ఎంపిడిఓ ఈశ్వరన్, తహశీల్దార్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిఓ నెం 85ను ప్రభుత్వం రద్దు చేయాలి

చిత్తూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

పిజి వైద్య విద్యలో రిజర్వేషన్ల కుదింపుపై ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 85ను ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ జిల్లాలోని పిహెచ్‌సిల వైద్యులు శుక్రవారం జిల్లా వైద్యాధికారులను కలసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల జిఓ 108ను రద్దు చేస్తామని పేర్కొందని అయితే పిపిపిలను ఆహ్వానించడం శోచనీయమన్నారు. సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌లో మెడికల్ కాలేజ్ స్థాపనకు అయ్యే ఖర్చులో 60శాతం కేంద్రం, మిగతా నలభై శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ప్రభుత్వం విద్యావిధానపర నిర్ణయాలను విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా తీసుకోవాలని కోరారు.

## చంద్రబాబుతోనే రాజధాని అమరావతి సాధ్యం

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** సిఎం నారా చంద్రబాబునాయుడుతోనే రాజధాని అమరావతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు సంతపేట పిఎస్సీ నగర పాలకోన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం కూటమి ప్రభుత్వం 100 రోజుల సుపరిపాలన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఒక్క రాజధాని ప్రకటించి దానిని రూపకల్పన చేసిన ఘనత నారా చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, మేయర్ అముద, నాయకులు వసంత్‌నాయుడు, బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, రామభద్ర, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం

**చిత్తూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**

స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అనిల్‌కుమార్ నాయక్ అన్నారు. కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం జైహింద్ పాఠశాల విద్యార్థులు, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో జరిగిన విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం విద్యార్థులు, యువత, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకుంటే మానవులు ఆరోగ్యంగా వుంటారన్నారు. ఈ విషయంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు లోకనాధం, నరసింహ, హెడ్మాస్టర్ బాలసుబ్రమణ్యం, మయుక్తార్ ఆహ్మద్, కల్పన, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

కుప్పంరూరల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



మల్లానూరు పంచాయతీ పరిధిలో చేపడుతున్న గృహ నిర్మాణాలు లబ్దిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఓ సాయిలహరి ఆదేశించారు. శుక్రవారం మల్లానూరులో జరిగిన సమావేశంలో ఆమె లబ్దిదారులతో మాట్లాడారు. లబ్దిదారులకు నెలాఖరులోగా బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి నిర్మాణాలకు డ్వాక్రా సంఘాలచే రుణాలు సైతం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. లబ్దిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్, నేతలు దామోదర్, రమేష్, పార్థసారథి, ఆర్ముగం, రమేష్, చంద్ర, ఎఇ అభి, కార్యదర్శి రమ్యలక్ష్మి పాల్గొన్నారు.

## నేటినుంచి ఇదిమంచి ప్రభుత్వం సభలు

**శాంతిపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21-26 తేదీల్లో ఇది మంచి ప్రభుత్వం సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం సొన్నేగానిపల్లి, దండికుప్పం, కొలమదుగు, అబకలదొడ్డి, తుమ్మిశిగ్రామాల్లో సభలు జరుగుతాయన్నారు.

## కాణిపాకం ఆలయానికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయండి

-మంత్రి లోకేష్‌కు బాధిత రైతులు వినతి

**కాణిపాకం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానం అభివృద్దిలో భాగంగా మాస్టర్ ప్లాన్ అమలు కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. కాణిపాకం ఆలయ అభివృద్ది కోసం 2003లో అప్పటి ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు హామీ మేరకు 26 మంది రైతులు ఆలయం చుట్టూ వున్న ఎంతో విలువైన వ్యవసాయ భూములను అతి తక్కువ ధరకు ఆలయానికి అందజేసినట్లు తెలిపారు. భూములిచ్చిన రైతులకు ఆలయంలో శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని, దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు ఇస్తామన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం భూములు కోల్పోయిన రైతులు పొరుగు సేవల కింద నెలకు కేవలం 15 వేల రూపాయలు పనిచేయాల్సి రావడంతో కుటుంబపోషణ భారంగా మారుతోందన్నారు. కావున అప్పట్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో శ్యామల,గౌరి, శ్రీలత, పురుషోత్తం నాయుడు, దామునాయుడులతో పాటు బాధిత రైతులు పాల్గొన్నారు.

## విజయవాడ రీజియన్ టేబుల్ టెన్నిస్‌లో బృందావన్ ప్రతిభ

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**



విజయవాడ రీజియన్‌కు సంబంధించి కాకినాడ నందు జరుగున్న అండర్ 14,17,19 ఛాంపియన్ షిప్ 2024-25 టేబుల్ టెన్నిస్ పోటీలలో బృందావన్ ఇంగ్లీష్ మీడియం సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు శాంతినికేతన్ సిబిఎస్ఇ స్కూల్‌తో తలపడి మొదటి విజయం అందుకొన్నట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టరు ప్రియతేజలు తెలిపారు. ఈ పోటీలకు సుమారుగా 30 సిబిఎస్ఇ పాఠశాలలు పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో ఎం. హర్షిత్, విష్ణు, రెడ్డిప్రసాద్, రిషి, బాలికలు నీతుశ్రీ, దేవశ్రీలు విశేష ప్రతిభ కనబరచారని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు కోచ్ మురళి, పిడి బేబిరాజ్, పిఇటి హేమలతలు అభినందనలు తెలిపారు.

## మంత్రి నారా లోకేష్‌ను కలసిన చల్లా

పుంగనూరు, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :



రాష్ట్ర మంత్రి నారాలోకేష్‌బాబును పుంగనూరు తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం బంగారుపాలెంలో కలిశారు. యువగళం పాదయాత్ర వందకిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఇచ్చిన మాట మేరకు బంగారుపాలెంలో కిడ్నీడయాలసిస్ సెంటర్‌ను నారా లోకేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనను కలసిన చల్లాబాబు పుంగనూరు నియోజకవర్గ అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను ఆయనతో చర్చించారు. త్వరలో పుంగనూరు నియోజకవర్గంలో పర్యటించేందుకు నారాలోకేష్ సంసిద్దత తెలిపినట్లు తెలిసింది.

## మదరసా భవనం నిర్మించాలని ఎమ్మెల్సీకి వినతి

కుప్పంరూరల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధి ఎన్టీఆర్ కాలనీలో మైనార్టీ విద్యార్థుల సౌకర్యార్థం మదరసా భవనం, ప్రహరీగోడ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్‌కు మైనార్టీ నేతలు సర్దార్, అన్సర్, జాకీర్, ఇర్ఫాన్, మహ్మద్ యాకూబ్‌లు వినతిపత్రం అందించారు. సుమారు 85మంది పిల్లలు అరబిక్ చదువుకుంటున్నారని ఖాళీ స్థలంలో మదరసా భవనం నిర్మిస్తే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని వారు కోరారు. దీనిపైఎమ్మెల్సీ డా॥ కంచర్ల సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

చెన్నై - బెంగళూరు రైలు మార్గంలో గుల్లేపల్లి సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మృతుడికి 55-60 ఏళ్ల ఉంటాయన్నారు. గుర్తు పట్టలేని విధంగా మృతుడి తలఛిద్రమైందన్నారు. దుస్తులపై అభిలాష్, దేవసంధ్ర అనే స్టిక్కర్ ఉందన్నారు. మృతుడ్ని గుర్తించిన వారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సిఎం చంద్రబాబుది ప్రజాసంక్షేమం..అభివృద్ధి ప్రభుత్వం



- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

రాష్ట్రంలో ఆర్థిక కష్టాలున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి ఎన్టీఆర్ కాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను నాలుగు,ఆరువేలకు పెంచి 64లక్షల మందికి ప్రతినెలా 1వతేది అందిస్తున్నారన్నారు. అలాగే 16349 డిఎస్సీ ఉద్యోగాల కల్పనకు తొలిసంతకం చేశారన్నారు. 1997నుంచి నేటివరకు సిఎం చంద్రబాబునాయుడు 2.32లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు గాను అన్న క్యాంటీన్లు ప్రారంభించారన్నారు. ప్రస్తుతం కుప్పం పట్టణంలో అన్న క్యా ంటీన్ ఉండగా త్వరలో మూడు మండలాల్లో కూడా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు సిఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటారన్నారు. జగన్ పాలనలో జీతాలు లేక ఇబ్బందులు పడ్డ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేది వేతనాలు అందిస్తున్నా రన్నారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. కుప్పం నియోజకవర్గం తరపున వరద బాధితులకు 40లక్షల విలువ చేసే వస్తువులను అందించామన్నారు. యువతకు ఉపాధి కల్పనకు శ్రీసిటీలో 17పరిశ్రమలు ప్రారంభించారన్నారు. ఇక కుప్పం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కుప్పంలో 1200 ఎకరాల్లో డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణంకు చర్యలు చేపట్టారన్నారు. అలాగే 250కోట్లతో కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా చేయాలని నిర్ణయించారన్నారు. 30కోట్లతో కుప్పంనియోజకవర్గంలో ఎన్‌ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రామకుప్పం మండలంలో 800కోట్లతో జూప్లెంట్ పరిశ్రమ ముప్పై ఎకరాల్లో త్వరలో ఏర్పాటు కానుందన్నారు. అలాగే కుప్పం సమీపంలో పాతిక ఎకరాల్లో ఓ పరిశ్రమ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, వేలు, నేతలు సత్యేంద్రశేఖర్, డికెపల్లి మణి, ఆర్ముగ ం, జనసేన నరేష్, బిజెపి శివశంకర్, సర్దార్, అన్సర్, మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, తిరుమగళ్, రవి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## గంగా భవానీకి రాహుకాలాభిషేకం

**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మ వారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో వేద పండితులు గోవర్ధనశర్మ ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం స్వయంగా భక్తులకు వడ్డించారు.



## ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

శాంతిపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రవేశాలకు గాను నాలుగో దఫా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 26వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 28న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కమీషనర్ శ్రీనివాసరావును అభినందించిన ఎమ్మెల్సీ

కుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావును ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ అభినందించారు. శుక్రవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం సభలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ విధుల్లో చేరిన తొలిరోజు నుంచే కమీషనర్ శ్రీనివాసరావు కుప్పం మున్సిపాలిటీలో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అలాగే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మున్సిపల్ వార్డుల్లో ప్రజల సమస్యల పరిష్కారంకు కమీషనర్ చేపడుతున్న కార్యక్రమానికి ప్రజలనుంచి మంచి స్పందన వస్తోందన్నారు. సమస్యలు, అభివృద్ధిపై కమీషనర్ శ్రీనివాసరావు చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బండారు శబరీష్ గుప్తా అన్నారు. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎన్‌జిఓ వాలంటీర్ వీరాస్వామి సహకారంతో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్‌కు చెందిన సాయిరామ్, ప్రసాద్, డాక్టర్లు లావణ్య, దాక్షాయణి, ఉదయని, సిబ్బంది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా ఫలాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని, వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలదని సూళ్లూరుపేట పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. వందరోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే.. అనే కార్యక్రమంలో భాగంగా మన్నారుపోలూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీతో 16437 పోస్టులు భర్తీ, పింఛన్ రూ.4 వేలకు పెంచడం, ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు 1వ తేదీనే అందజేయడం, స్థానిక సంస్థలకు 1,452 కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోయడం, రూ.5కే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. కార్యదర్శి ఎజి కిషోర్, సిహెచ్ రమణయ్య, పామూరు మునస్వామి, శంకు సురేష్ పాల్గొన్నారు.

## వందరోజుల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు



- ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కోట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వందరోజుల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నా రు. శుక్రవారం కోట మండలం ఉత్తమనెల్లూరు గ్రామంలో మంచి ప్రభుత్వం అనే ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఒకేసారి అధిక మొత్తంలో పింఛన్లు ఇప్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఉత్తమ నెల్లూరు గ్రామానికి వంద పక్కాగృహాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జయజయరావు, ఎంపిడిఓ భవాని, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, బిజెపి నాయకులు ఆనందరెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి

**చిట్టమూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపిడిఓ షాలెట్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి అందిన స్టిక్కర్లు, పాంప్లేట్లను ప్రతి ఇంటికి అందజేసి ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు వివరించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి చిట్టమూరు మండలంలోని 15 సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. చిట్టమూరుకు ఎంపిడిఓ షాలెట్, మెట్టు సచివాలయం పరిధిలో తహశీల్దార్ ఐఎస్ ప్రసాద్, పెళ్లకూరుకు ఏఇ ఆర్‌డబ్ల్యుఎస్ అరవింద్, గునపాడుకు ఎంఇఓ-1 బివి కృష్ణయ్య, మొలకలపూడికి ఎంఇఓ-2 కెవి ప్రసాద్, అరవపాలెంకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, గునపాటిపాలెం ఐసిడిఎస్ అధికారి ఐవి శేషమ్మ, చిల్లమూరుకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.పద్మ, ఈశ్వరవాకకు మండల వ్యవసాయాధికారి ఎం.సుచేంద్రప్రసాద్, ఆరూరుకు ఏపిఓ చిన్నయ్య, కోగిలికి ఎపిఎం సిహెచ్ ఉమాదేవి, యాకసిరికి హౌసింగ్ ఏఇ సుధీర్‌కుమార్, మల్లాం-1కు ఏఇ ఇరిగేషన్ అబ్దుల్ ఘని, మల్లాం-2కు ఏఇ ఇరిగేషన్ మహేష్‌లతో పాటు బురదగాలి కొత్తపాలెం సచివాలయానికి ఇఓపిఆర్‌డి వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిపారు. ఆయా అధికారులు ఈ నెల 26వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న సంక్షేమ పథకాలను పర్యవేక్షించాలని చెప్పారు.

## అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

కోట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



మండల కేంద్రమైన కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఇఓ మస్తానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమలో ఉన్న నైపుణ్య క్రీడను ప్రదర్శించాలని కోరారు. క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని చెప్పారు. క్రీడలతో మంచి పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్, పరుగుపందెం, లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్ తదితర ఆటల పోటీలతో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

## ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంపై విస్తృత ప్రచారం



- 22న వాటంబేడులో ఎమ్మెల్యేచే కార్యక్రమం

**తడ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** తడ మండలంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల వ్యవధిలో చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఇది మంచి ప్రభుత్వం పేరుతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఎంపిడిఓ విజయకుమార్ ఆధ్వర్యాన వాటిని ఇంటింటా పంపిణీకి శ్రీకారంచుట్టారు. అందరు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మండల స్థాయి అధికారులతో ఈ కార్యక్రమం గురించి సమావేశం నిర్వహించారు. ఈ నెల 22న మండల పరిధిలోని వాటంబేడు సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొంటారన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన

చిల్లకూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



చింతవరం సెక్టార్ కోమరివారిపాలెంలో శుక్రవారం అంగన్‌వాడి కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన ఆహారం జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎసిడిపిఓ జ్యోతి కిరణ్ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవాలనిచెప్పారు. సూపర్‌వైజర్‌పి. శివజ్యోతి, కార్యకర్తలుముత్యాలమ్మ, హైమావతి, చంద్రకళ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను అవకతవకలు లేకుండా నిర్వహించాలి

వ్యవసాయ కార్మికుల నాయకులు డిమాండ్



**గూడూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** ఉపాధి హామీ పనులను అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని వ్యవసాయ కార్మికుల నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరు మండలం నూతన కమిటీ 21 మందితో ఎన్నుకోవడం జరిగింది. స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీస్‌లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని ఉపాధి హామీ పథకాన్ని సంవత్సరం పొడుగు 365 రోజుల్లో 200 రోజులు పాటు పని నిర్వహించాలని రోజు వారి పని వేతనం 600 రూపాయిలు కేటాయించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు జీవనాధారం పెరిగే విధంగా ఉపాధి హామీ ఉపాధి హామీ పనులను రోజులను పెంచాలని తెలియజేశారు. అనంతరంగూడూరు మండలం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీ 21 మందితో ఎన్నుకున్నారు. వ్యవసాయకార్మికసంఘంనూతనఅధ్యక్ష,కార్యదర్శులు వెంకటయ్య, నారాయణను ఎన్నుకోవడం జరిగింది.

## రాష్ట్రాభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యం

**గూడూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయింది. ప్రతి ఇంటికి ప్రభుత్వం విజయాలు చేరాలి అనే ఉద్దేశ్యంతో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. గూడూరు రూరల్ పరిధిలోని తిప్పారప్పాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఎంపిడివో వెంకటేశ్వర రావు, స్థానిక టిడిపి నాయకులు కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా డిఎస్సి నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. అదే విధంగా పెన్షన్లు పెంచడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఐదు రూపాయిలతో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను పున: ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**గూడూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో సనత్ కుమార్, ఎంపిడివో వెంకటేశ్వర రావు ముఖ్య అతధిగా పాల్గొని క్రీడా పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని పేర్కొన్నారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్ క్రీడలకు సంబంధించి క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను నియోజకవర్గక్రీడలకుఎంపిక చేసినట్లు తెలిపారు. పాఠశాల పిడిలు, పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బీసి రెసిడెన్షియల్‌కు దాతృత్వం

వాకాడు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



కోటలోని మహాత్మ జ్యోతిరావ్ బీసీ గురుకుల పాఠశాలలోని టిడిపి నాయకులు పంత్రంగం అరుణ్ కుమార్, చరణ్ రెడ్డిలు దాతృత్వం చాటుకున్నారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌కి సంబంధించి తమ బాధ్యతగా కుర్చీలను అందజేశామని ఈ సందర్భంగా తెలిపారు. కోట, వాకాడు, ఎస్సి, బిసి, ఎస్టి, గురుకుల పాఠశాలకు మెరుగైన వసతులు కల్పించడంలో తమ వంతు బాధ్యతగా తీసుకుంటామని సంబంధించిన పాఠశాల సిబ్బందికి తెలియజేశారు. అరుణ్ కుమార్, చరణ్ రెడ్డిలకు బీసీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎంపిడిఓ



**వాకాడు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబరిచి విజేతలుగా రాణించాలని ఎంపిడివో మనోహర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం వాకాడులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల గ్రౌండ్ నందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపిడివో మాట్లాడుతూ చదువుతో పాటు ముఖ్యమైంది ఆటలు అని అన్నారు. ఈ గేమ్స్ ద్వారా విద్యార్థులు మానసికంగా, ఉల్లాసంగా, శారీరకంగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఎంఈవో నసీం అలి మాట్లాడుతూ ప్రభుత్వం అంతా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గేమ్స్‌ను ప్రతి ఒక్కరు పార్టిసిపేట్ చేసి మండల స్థాయిలో విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో రాణించి వారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ క్రీడల్లో గురుకుల పాఠశాలప్రిన్సిపాల్‌రామానుజచార్యులు,ప్రధానోపాధ్యాయులుపి. ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## చదువులతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు శ్రద్ధ చూపాలి



**వెంకటగిరి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ తెలిపారు. వెంకటగిరి గురుకుల పాఠశాలలో మండల నియోజకవర్గం చైర్ పర్సన్, ఎంపిపి తనుజా రెడ్డి కలిసి ప్రారంభించారు. కేవలం నేటి విద్యార్థులు చదువు పై దృష్టి సారించి అనారోగ్య ఫాలో అవుతున్నట్టు తెలిపారు. మానసిక శారీరక ఆరోగ్యం కోసం తప్పనిసరిగా క్రీడలు పట్ల శ్రద్ధ చూపాలని తెలిపారు. ఆటలు పోటీల్లో గెలుపు ఓటములు సాధ్యమని చెప్పారు. క్రీడలు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కోటేశ్వర రావు, ఎంఈఓ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## వందరోజుల సిఎం చంద్రబాబు పాలన ప్రజలు మెచ్చే విధంగా సాగింది

టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు

బాలాయపల్లి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త

ఆంధ్ర ప్రజలంతా నచ్చే విధంగా సిఎం చంద్రబాబు 100 రోజుల పరిపాలన సాగిందని మండల టిడిపి అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. వంద రోజులు టిడిపి పాలన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. వందల్లోనూ ప్రజలకు నష్టం, కష్టం కలగకుండా పనిచేసిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమేనని తెలిపారు. ఎప్పుడు ప్రజల్లో ఉండే ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఎంపిడివో వినీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రామకృష్ణ

**బాలాయపల్లి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** మండలంలోని మన్నూరు గ్రామంలో కలిసి ఉన్న పోలేరమ్మ గుడిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ

**తిరుపతి విద్య సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుల భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు ఏపీ స్టూడెంట్స్ జే ఏ సి ఆధ్వర్యంలో ఈ నెల 28న శనివారం ఎస్.వి.యూనివర్సిటీ లోని సెనెట్ హాల్లో నిర్వహించుటకు ఏపీ స్టూడెంట్స్ జేసీ పిలుపునిచ్చింది.అందులో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ అధ్యక్షులు మల్లి ఉపేంద్ర ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్టర్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయంతి వేడుకలను విజయవంతం చేయాలని యూనివర్సిటీ అధ్యక్షులు మల్లి ఉపేంద్ర,జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్ పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఏపీ స్టూడెంట్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మణికంఠ,యునివర్సిటీ కమిటి జేఏసి నాయకులు శ్రీను,వెంకటేష్,నవీన్,సుబ్బారెడ్డి,రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు



## జివో 70ను రద్దు చేయాలి!

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

ఆర్టిసి కార్మికులు, ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని జివో 70ను రద్దు చేయాలని కోరుతూ ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశంలో డిమాండ్ చేసారు. ఇక్కడి పుచ్చల పల్లి సుందరయ్యభవన్‌లో శుక్రవారం ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్టిసి నాయకులు మాట్లాడుతూ కొన్ని అర్థరహిత నిర్ణయాలతో గత ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. అభ్యంతర కర నిర్ణయాలతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. అలాంటి ప్రమాద కర జివోలను ప్రజా ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. 1/2019లో జారి చేసిన సర్కులర్‌ను అమలు చేయాలని, జివో నెంబర్ 70ని రద్దు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. హైయర్ పెన్షన్ వల్ల కార్మికులు అనేక అటంకాలు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు.కార్మికుల సమస్యలను ఈపిఎఫ్ఓ అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎన్‌వియే రెడ్డి,జిలాని, దేవి రాజకుమారి,మనోహరి,ఎన్.విజయలక్ష్మీ,సుజాత, వినీల, శారద, వజీర్, కృష్ణయ్య, శ్రీధర్, జైకుమార్, ఏలుమలై, సిఐటియూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించారు.



## వైకాపాకు కొట్టిడి గుడ్‌బై

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పట్టణ మాజీ వైకాపా అధ్యక్షుడు కొట్టిడి మధుశేఖర్ రాజీనామా చేసినట్లు శుక్రవారం తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో టిటిడిలో జరిగిన అపకారానికి నిరసనగా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కల్తీ నెయ్యితో లడ్డుల తయారితో ఆదాయాలు సాధించవచ్చు కానీ భారత దేశంలో హిందు వుల మనోభావాలను దెబ్బతీయటం తగదన్నారు.ఈ కల్తీ భాగోతంలో ఎవరున్నారో నిగ్గుతేల్చి వారిని కఠిన శిక్ష విధించాలని కోరారు.

## తిరుమల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా . . .

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** తిరుమల తిరుపతి లడ్డులను భారత దేశంలోని ఎవరైనా పవిత్రంగా భావిస్తారని అలాంటి ప్రసాదాన్ని వైకాపా ప్రభుత్వం హయాంలో మలినం చేయటం తగదని ఈ సంఘటన తిరుమల ప్రతిష్టను మంటగలిపినట్లుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ శుక్రవారం ఖండించారు.వైసిపి హయాంలో దేవాలయాల్లో విగ్రహాలను, రథాలను కూల్చటం,కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. హిందువుల మనోభావాలను,విశ్వాసాలను వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. ఇది సనాతన ధర్మంపై దాడి అని చక్రధర్ అన్నారు.

## తొండమాన్ పురంలో మోదీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల సంబరాలను రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ ఏర్పాటు చేసారు.శుక్రవారం వృద్దుల ఆశ్రమంలో సంబరాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు, రైతులను ఆదుకొనుటకు పలు పథకాలతో పాటు రాష్ట్రాల సమగ్రాభివృద్దికి ప్రధాని ప్రత్యేక నిధులను అందిస్తున్నారన్నారు.అలాంటి నాయకుని జన్మదినాన్ని ఇక్కడ నిర్వహించుకోవటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శుక్రవారం ఆశ్రమంలో వృద్దులకు చీర జాకెట్లను, పంచె టవల్స్ ను అందించారు. అలాగే పండ్లు అందించారు.ఈ కార్యక్రమాల్లో మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, అమ్మపాళెం రమణారెడ్డి, కూనాటి నాగరాజు,ఆశ్రమం మేనేజర్ కందపరెడ్డి,సుబ్రమణ్యం రాజు, పోలయ్య, గోపి,సుబ్రమణ్యం, మాధవరెడ్డి, హరీష్,చెంచురెడ్డి, నాని, సాయి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన మాజీ కౌన్సిలర్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త** తెలుగుదేశంపార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారాలోకేష్ తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటనలో భాగంగా అన్నా క్యాంటీన్ల ప్రారంభోత్స వానికి విచ్చేసిన ఆయన్ను 9వ వార్డు మాజీ కౌన్సిలర్ శెంజిగరంసుప్రజల మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి ఆయనకు శివయ్య తీర్ధప్రసాదాలు అందించి సత్కరించారు.ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి అభివృద్దిచేయాలని ఎంఎల్ఏగా బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి హయాంలో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ప్రక్షాళన ప్రారంభించారని దీంతో దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నాయని నారాలోకేష్‌కు వివరించారు. ఇక రోడ్లు, పారిశుద్యానికి నిధులు కేటాయించాలని నారాలోకేష్‌ను సుప్రజల కోరినట్లు వివరించారు.

## దార్శనిక మహాత్ముడు ఎన్టీఆర్



**తొట్టంబేడు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**దార్శనిక మహాత్ముడు ఎన్టీఆర్ అని తెలుగుదేశంపార్టీ సీనియర్‌నాయకుడు శేషమనాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన గాలివెంకట్రామానాయుడు అన్నారు. శుక్రవారం అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వర్గీయ సీనియర్‌ఎన్టీఆర్ మూడు వేషధారణలో ఉన్న చిత్రపటాన్ని ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డికి బహూకరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, గాలిమురళీనాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ చేతులమీదుగా చిత్రపటాన్ని బహూకరించారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ అన్నా క్యాంటీన్ నందు చిత్రపటాన్ని ఉంచాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గాలిమురళీనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అన్నా క్యాంటీన్‌ను బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభించడం తర్వాత ఆయన తనయుడు బొజ్జలసుధీర్‌రెడ్డి ఎంఎల్ఏగా అయిన ఆయన చేతులమీదుగా ప్రారంభించే అవకాశం దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పేటబాలాజీరెడ్డి, మిన్నల్‌రవి,వజ్రంకిషోర్,కాసరంరమేష్,జనసేననాయకులు కొట్టేసాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పితృపక్షం అన్నదానంలో పాల్గొన్న తిరుపతి మేయర్ శిరీష

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



తిరుచానూరు యోగిమల్లవరంలోని శ్రీ సాలగ్రామ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన పితృపక్ష అన్నదానం నాల్గవ రోజు కార్యక్రమంలో తిరుపతి మేయర్ శిరీష ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేది వరకు 16 రోజుల పాటు నారద పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పితృపక్షం అన్నదానం లో పాల్గొనడం ఆనందంగా ఉందని మేయర్ తెలిపారు. ఆమె మాట్లాడుతూభాద్రపద పూర్ణిమ నుంచి అమావాస్య వరకు మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు 16 రోజులు పిత్ర దేవతలను తృప్తి పరిచే పనులు చేయటం ద్వారా పిత్ర రుణం తీర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని అర్చక స్వాములు వేద ఆశీర్వచనం చేసి, మూలమూర్తి శేషవస్త్రం ఆమెకు అందించారు. ఈ కార్యక్ర మంలో నారదపీఠం వ్యవస్థాపకులు దినేష్ స్వామి, శ్రీ సాలగ్రామ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణ మండలిసభ్యులుడాక్టర్‌వేణు గోపాల్, మేడసానిసురేందర్‌నాయుడు, రూపేష్, దీప, అనురాధ పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఫుడ్ అండ్ హెల్త్ మేళ

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:** పోషకాహార మాసోత్సవ సందర్భంగా జరిగిన ఫుడ్ అండ్ హెల్త్ మేళలో వివిధ విభాగాలకు చెందినటు వంటి విద్యార్థులు ముఖ్యంగా ఎం ఎస్ సి హోమ్ సైన్స్,ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ,బి వోకేషనల్ న్యూట్రీషన్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్ మరియు ఫ్యాషన్ టెక్నాలజీ,ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ పాల్గొన్నారు.ఈ ఫుడ్ అండ్ హెల్త్ మేళ వేదికగా విద్యార్థినులు వివిధ రకాలైనటువంటి ఆహార పదార్థాలని తయారుచేసి విక్రయించడం జరిగినది.ఇందులో ముఖ్యముగా రాగి మునగాకు పిట్టు మరియు అరటి పువ్వు వడ,నాన్ వెజ్ పచ్చళ్ళు,ఆకుకూరపొడులు,వివిధ రకాలైనటువంటి పండ్ల రసాలు సందర్శకులని ఆకర్షించాయి.ఇంచార్జ్ వైస్ ఛాన్స్లర్ ఆచార్యులు ఉమా, రిజిస్టర్ రజిని,సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ వాణి,సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాతమ్మ,హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బిందు,ప్రొఫెసర్ ఎం అరుణ,ప్రొఫెసర్‌విజయ్ జ్యోతి,డాక్టర్ శిరీష,ఇతర వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతం ఇవ్వాలి

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం బిజెపికి కేటాయించిన 10 శాతం నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ కు తిరుపతి తాజ్ హోటల్ నందు కలిసి వినతి పత్రం ఇచ్చారు.డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ బీసీలలో రాజకీయంగా ఆర్థికంగా నేటికీ కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని,దేశంలో రాష్ట్రంలో బీసీల జనాభా 70 శాతం మంది ఉన్నారు.

## టోల్ ప్లాజా "మురుగన్ చాయ్"తో "లోకేష్" మధురస్మృతులు

చంద్రగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:



గాదంకి టోల్ ప్లాజా వద్ద మురుగన్ చాయ్‌తో విద్య, ఐ.టి.శాఖ మంత్రి నారా లోకేష్ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అధికారిక కార్యక్రమానికి బంగారుపాళ్యం వెళ్ళి తిరిగి రేణిగుంట ఎయిర్ పోర్టుకు వెళుతున్న క్రమంలో ఎంఎల్ఏ పులివర్తి నాని ఆహ్వానంతో మేరకు టోల్ ప్లాజా వద్ద కొంత సమయం ఆగారు. ఈ సందర్భంగా మురుగన్ టీ షాపులోకి వెళ్ళిన లోకేష్ యువగళం పాదయాత్రలో ఇక్కడ టీ రుచిచూసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఎన్‌డిఏ కూటమి ఘన విజయం సాధించడంలో యువగళం పాదయాత్ర కీలకంగా మారిన నేపథ్యంలో ఈ మార్గంలో వెళుతూ ఇక్కడ చాయ్ త్రాగిన ఆయన నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం లభించింది.

## 23న ఇందిరమ్మ కాలనీలో "ప్రజా వేదిక"

**చంద్రగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో ఈ నెల 23న ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ బాలాజీ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్ కళ్యాణ్, ఐ.టి., విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 100 రోజుల పాలన ప్రగతికి నిదర్శనంగా "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎంఎల్ఏ పులివర్తి నాని ఈ నెల 23న మధ్యాహ్నం 2 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

## అధ్వాన స్థితిలో దామలచెరువు వాల్లివేడు కనెక్టివిటీ రోడ్డు

రోడ్డుపై వాహనదారులకు తప్పని ఇక్కట్లు



**పాకాల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త** పాకాల మండలం దామలచెరువు నుంచి కొమ్మిరెడ్డిగారి పల్లి రోడ్డులో మూడు సంవత్సరాల నుండి రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొగరాల చెరువు కట్ట పైన రోడ్డు తీవ్ర అధ్వాన స్థితిలో ఉండడం చాలా చోట్ల రోడ్డు అణిగిపోయి ఎక్కువ ప్రమాదాలకి కేంద్రబిందువుగా మారుతున్న ఈ చెరువు మలుపులు ఇక్కడ వర్షం పడినప్పుడల్లా గోతులలో నీళ్ల నిలబడి వాహనదారులకు గోతులు ఎక్కడున్నాయో తెలియక ద్విచక్రవాహనాలు ఆటోలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. అంతే కాకుండా కూటమి ప్రభుత్వ పాలనలో పరిస్థితులు చక్కబడు తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ అధ్వాన పరిస్థితికి నుంచి అధికారులు వెంటనే స్పందించి గోతులు పూడ్చి సమస్యలు పరిష్కరించవల్సిందిగా ప్రజలు వాహనదారులు కోరుచున్నారు.

## అట్టహాసంగా మండల స్థాయి పోటీలు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**



మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు పుత్తూరు ఎస్ ఆర్ఎస్ జడ్పీ హైస్కూలులో అండర్-14,17 బాల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు తిరుమల రాజు, బాల సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. వాలీ బాల్, ఖోఖో, కబడ్డీ 14,17 బాల బాలికలకు పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు నియోజకవర్గ స్థాయిలో తలపడనున్నాయి. శనివారం జరిగే చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మండల కో-ఆర్డినేటర్ సి.ఎస్.నందకుమార్, జోనల్ కార్యదర్శి ఏ.గోపికృష్ణ, పీడీలు మోహన్, జయదేవ్, అరుణ్, సునీత, కవిత, భూపతి, సంసుద్ధి, బాబు, గంగరాజు, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## సుపరిపాలన అందించడమే టీడీపీ లక్ష్యం

**వడమాలపేట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వడమాలపేటలో రాష్ట్ర అభివృద్ధిపై కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలను వెలికి తీస్తూ నష్టపోయిన ప్రజలందరికి న్యాయం జరిగేలా టీడీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ, టీడీపీ నాయకులు గురునాథంశెట్టి, శివరాయల్ తదితరులు పాల్గొన్నారు.



## గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి



**రేణిగుంట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** భారతీయులు అతి పవిత్రంగా భావించి పూజించే గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను వెంకటాద్రి యాదవ్ కలసి గోమాత యొక్క ప్రత్యేకతను వివరిస్తూ ఆవు శరీరం నుంచి వచ్చే గోమయం, గోమూత్రం అనేక ఔషధ గుణాలతో పాటు, నెయ్యి, పాలు, పెరుగు ఎంతో బలమైన ఆహారం అని వాటిని దైవ సేవలకు ఉపయోగిస్తారని వినతిపత్రంలో పొందుపరస్తు మంత్రికి అందజేశారు. దీంతో పాటు పూర్తిగా గోవధను నిషేధించాలని కోరారు. వీటన్నిటికీ మంత్రి సానుకూలంగా స్పందించారు.

## ఆస్పత్రికి మందుల సరఫరా



**రేణిగుంట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ పంచాయతీ వేమాపురం సంజీవరెడ్డి కాలనీ ఆరోగ్య వైద్య కేంద్రానికి వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మిపతిరెడ్డి మందులను అందజేశారు. గ్రామ ప్రజల వైద్య సేవలను దృష్టిలో పెట్టుకుని మందులను అందజేసినట్టు లక్ష్మిపతిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం అకాల ప్రకృతి వైపరీత్యాలకు అనేక రకాల విష జ్వరాలు వస్తున్నాయని, వాటిని అదుపు చేయడానికి మందులు అందించామని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ, సొసైటీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మనది ప్రజల ప్రభుత్వం - బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:



తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రేణిగుంట మండలం కరకంబాడి మా నగర్‌లో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజా వేదికను నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజలకు సేవ చేసే పార్టీగా అభివర్ణించారు. ఎన్నికల వాగ్దానాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే గుత్తివారిపల్లె గ్రామం వద్ద నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం స్థితిగతులను గ్రామస్తుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు, జిల్లా టీడీపీ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు చిన్నారెడ్డి, మునస్వామినాయుడు, బుజ్జినాయుడు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధికి 25 లక్షల విరాళం

**రేణిగుంట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి శ్రీకాళహస్తి ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ తరపున కంపెనీ ఎండీ ఖండేల్వాల్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు రేణిగుంట విమా నాశ్రయంలో శుక్రవారం 25 లక్షల రూపాయల చెక్కును స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు.



## వరవ కాలువను మరమ్మతు చేసి సేఫ్టీవాల్ నిర్మించండి

**విజయపురం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** మండలం



లోని కోసలనగరం పోతురాజులసైక నుంచి గంగ మ్మ మాను వరకు పాతార్కాడు చెరువుకు వెళ్లే వరవ కాలువను మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వరవ కాలువ పూడి పోవడంతో తేలికపాటి వర్షం కురిసినా రోడ్డుపైన పారు తుం దని, కొంత నీరు నిలిచిపోవడంతో మురుగునీరుగా మారి దుర్గంధమైన వాసన వస్తుందని వాపో తున్నా రు.వరవకాలువనీరు రోడ్డుపైం ప్రవహించకుండా సేఫ్టీవాల్ నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విజయపురం ఎస్ఐగా బలరామయ్య

**విజయపురం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:** విజయపురం ఎస్ఐగా బలరామయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కదిరిలో పని చేస్తూబదిలీపై విజయపురం వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపై పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని సిబ్బంది సాదారంగా పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు.

# తిరుపతి డివిజన్

## రూ.5 రూపాయలకు సంతృప్తికరమైన భోజనం



**తిరుపతిరూరల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** అన్న క్యాంటీన్‌లో కేవలం రూ.5రూపాయలకే సంతృ ప్తికరమైన, రుచికరమైన భోజనం అందుతుందని టిడిపి సీనియర్ మహిళా నేత దంపూరి రాజ్యలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ముత్యాలరెడ్డిపల్లిలో వున్న అన్న క్యాంటీన్‌లో ఆమె భోజనం వడ్డించారు. అన్న క్యాంటీన్‌కు పేదలు, మధ్యతరగతి ప్రజలు క్యూలైన్‌లో నిలబడి భోజనం చేసి, సంతృప్తిగా ఆనందంగా వెళ్ళుతున్నారని తెలిపారు. ఈ క్యాంటీన్‌లో ఉదయం 350 మందికి అల్పాహారం, మధ్యాహ్నం 500మందికి భోజనం, రాత్రి 200 మందికి డిన్నర్ అందిస్తున్నట్లు తెలిపారు. క్యాంటీన్ నిర్వాహకురాలు కోకిల పర్యవేక్షణలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్ అందిస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు విద్యా సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



విద్యార్థులు విద్యా సామాగ్రిని సద్వినియోగం చేసుకుని ఎదగాలని మండల విద్యాశా ఖాధికారి ఉమామహేశ్వరావు పేర్కొన్నారు. మండలంలోని దేవళంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు లీలావతి విద్యార్థులకు అవసరమైన రాతపుస్తకాలు, ఇతర సామాగ్రి వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు సాయం చేయడంకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ బడులల్లోనే నాణ్యమైన విద్యా అందుతుందని , తల్లిదండ్రులు గుర్తించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు నాగరాజ రెడ్డి, వెంకటాద్రి నాయుడు, శ్రీరాములు నాయుడు. విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చవనపల్లెలో వైద్య శిబిరం

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :** మండలంలోని పెరుమాళ్ళపల్లె సచివాలయం పరిధిలోని గొడుగుచింత పంచాయితీ పరిధిలోగల చవనపల్లెలో వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చవనపల్లె గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, 40 మందికి జనరల్ ఓపి చూడగా అందులో ఇరవై మందికి జర్వాలు ఉన్నాయని చెప్పారు. రక్త నమూనాల ద్వారా పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ, మలేరియా లేదని చెప్పారు. మరో రెండు రోజుల తరువాత ఆరోగ్య కేంద్రంకు వస్తే టైఫాయిడ్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఆ మేరకు వైద్య అందిస్తామన్నారు.

## సత్యవేడులో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమం



**సత్యవేడు, సెప్టెంబరు 20 ప్రభాతవార్త:**సత్యవేడు పట్టణం 3వ సచివాలయ పరిధిలోని కుమ్మరిగుంట, పాపానాయుడు వీధి, అలాస్వామి వీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు మురళి(చికెన్ చిన్న), శంకరయ్య, షణ్ముగం తదితరులు సచివాలయ సిబ్బందినవీన్, ప్రకాష్, త్యాగరాజుతో కలసి ఇంటింటికి వెళ్లి టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

## ఎస్పిడబ్ల్యూ డిగ్రీ హిందీ సప్తాహ్ సమారోహ్ కార్యక్రమం

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హిందీ విభాగం హిందీ సప్తాహ్ సమారోహ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడు తూ హిందీ దివస్‌ను ప్రతి ఏడాది సెప్టెంబర్ 14న బియోహర్ రాజేంద్ర సింహ జన్మదినాన్ని పురస్కరించు కొని జరుపుకుంటామని, 1949లో భారత రాజ్యాంగ సభ దేవి నాగిని లిపిలో రాయబడే హిందీని జాతీయ అధికారకి భాషగా గుర్తించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందీ దివస్‌ను పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజయం సాధించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగిపతి పి వెంకటలక్ష్మి, హిందీ అధ్యాపకులు జి సుధాకర్,డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ లక్ష్మీ సంధ్య, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ టి.కె పద్మజ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించాలి

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** మహిళా విశ్వవిద్యాలయంలో కార్బన్ న్యూట్రాలిటీ, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా స్వతాహి సేవ లో భాగంగా యూనిట్ 16 ప్రోగ్రాం ఈఫీసర్ అనిత వాలంటీర్స్ తో కలిసి విశ్వ విద్యాలయంలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు సేకరించడం జరిగింది.ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నిషేధించాలని ఆచార్య విద్యావతి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్లాస్టిక్ నిషేధించడంలో భాగం కావాలని ఉపకులపతి ఉమా,రిజిస్ట్రార్ రజిని పేర్కొన్నారు.నర్సింగ్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపాల్ గంగా భవాని,కార్బన్ న్యూట్రాలిటీ మెంబర్స్ అశ్విని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎస్‌జిఎస్ ఆర్ట్సకళాశాలలో ఐటి ఉద్యోగాలపై అవగాహన సదస్సు

**తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:** ఎస్‌జిఎస్‌ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఉచిత కెరీర్ గైడెన్స్ సెమినార్ నిర్వహిం చారు.జగతి నెట్వర్క్ ఇండియా హెచ్ఆర్ సొల్యూషన్స్,గో ఆన్లైన్ ట్రైనింగ్స్ సహకారంతో హైదరాబాద్, బెంగళూరు నుంచి విచ్చేసిన జాతీయ శిక్షకుల ద్వారా నాన్ ఐటీ విద్యార్థులకు ఐటీ రంగంలో ప్రవేశానికి కావలసిన స్కిల్స్, ఐటీ రంగంలో ఉన్న అవకాశాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్య నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి విచ్చేసి ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో వివిధ కోర్సులలో ప్రవేశం పొందిన తమ విద్యార్థులు మంచి ఫ్యాకల్టీ ద్వారా ఉత్తమ విద్యను అభ్యసిస్తున్నారని,ఈ విద్యతో పాటు స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా మంచి అవకాశాలు అందిపుచ్చుకుంటారని, దీనిపై ఉచిత అవగాహన కల్పిస్తున్న జగతి నెట్వర్క్ హెచ్చార్ సొల్యూషన్స్, గో ఆన్లైన్ ట్రైనింగ్స్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. మోహన్, రవికుమార్, బైపల్లి, హరత్ కృష్ణ,రమేష్ జటగి,చంద్రశేఖర్,రజిత శంకర్ నారాయణ,చంద్రయ్య,వైస్ ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కో సిబ్బంది మామిడిచెట్లు నరికివేత

ఎస్ఈ సురేంద్ర నాయుడుకు రైతు ఫిర్యాదు

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** ట్రాన్స్‌కో సిబ్బంది పంటకొచ్చిన మామిడి చెట్లను ఇష్టానుసారంగా నరికి వేయడంపై తిమ్మరాజుపల్లికి చెందిన మహిళా రైతు నూతలపాటి జ్యోతి శుక్రవారం ఎపి ఎస్పీడిసిఎల్ తిరుపతి ఎస్ఈ సురేంద్ర నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం రామచంద్రాపురం మీడియా సెంటర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన పొలంలో మామిడి చెట్లను పెంచుకుంటున్నాని, అయితే తనకు తెలియకుండా విద్యుత్ శాఖ సిబ్బంది చెట్ల కొమ్మలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఓ రామమూర్తికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెట్ల కొమ్మలు తీగలకు దూరంగా వున్నప్పటికీ నరికి వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఎంఎల్ఏ పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు.

## 30న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజన సభ

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహా జనసభను ఈ నెల 30న రామచంద్రాపురం పిఎ సిఏస్‌తో నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ విండో పర్సనల్ ఇన్‌చార్జ్ సునీల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో 2023-24 ఆర్థిక సంవత్సరం నిర్వహించిన లావాదేవీల ఆడిట్ రిపోర్ట్‌ను సభకు చదివి వినిపిస్తామన్నారు. రెండు సంవత్సరాలుగా లావాదేవీలు జరపని సభ్యులను, భూమిలేని వారిని, మరణించిన వారిని, గ్రామాలలో వలస వెళ్ళిన వారిని సభ్యత్వం నుండి తొలగిస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదార్ ఈ.కె.వై.సి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సంఘం నుండి అప్పు తీసుకుని దీర్ఘకాలం పాటు తిరిగి చెల్లించని వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడంపై చర్చిస్తామన్నారు. సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## తల్లిపేరుతో ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలి

పాకాల, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



పాకాల మండలం కావలివారిపల్లెలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గ మహి ళా అధ్యక్షురాలు సావిత్రి ప్రభాకర్ చేతుల మీదుగా స్థానిక నాయకుల సమక్షంలో చేపట్టారు. తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సావిత్రి పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పర్యావ రణాన్ని పరిరక్షించుకోవచ్చని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలివారిపల్లి సర్పంచ్ చంగల్‌రాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి లోకేష్‌ను కలసిన పిసి రాయులు

తిరుపతి విద్య,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:

డాక్టర్ పిసి రాయులు,మెంబర్,ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఎఫ్సా ఐ.ఎస్ ఎల్ సి ఏపీ,జెడ్ ఆర్ యు సి సి సౌత్ స్కెరటల్ రైల్వే,దిశా ఆర్డి అండ్ పి ఆర్,ఎం ఎస్ ఎం ఈ రాజ భాష సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు,చైర్మన్,కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ శుక్రవారం తన అధికారిక పర్యటనలో చిత్తూరు,తిరుపతి జిల్లాలకు విచ్చేసిన మాన వనరుల శాఖమంత్రి ఈ అండ్ సి.ఆర్టిజి అండ్ ఐటి గవర్నమెంట్ ఆఫ్ రాష్ట్ర మంత్రిను తిరుపతి ఎయిర్పోర్ట్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగినది.

# ప్రభుత్వ పాఠశాలలు నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా

## విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

చిత్తూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలలను ఈ ఐదేళ్ళలో నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండలం ఆనకంబట్టు జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంత్రి నారా లోకేష్ 8, 9 10 తరగతి విద్యార్థుల క్లాసులకు వెళ్ళి అక్కడి లోటుపాట్లను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది విద్యార్థులు తమకు ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు అందలేదని మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేయడంతో సత్వరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠ్యాంశాలు ఏ భాషలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారని విద్యార్థులను మంత్రి ప్రశ్నించగా విద్యార్థులు తమకు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషల్లో ఉపాధ్యాయులు



ఆనకంబట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.

పాఠ్యాంశాలు బోధిస్తున్నారని సమాధానం చెప్పారు. పాఠశాలలో డెస్కులు లేకపోవడంతో నేలపై కూర్చోవాల్సివస్తోందని డెస్కులు ఏర్పాటు చేయాలని మంత్రిని విద్యార్థులు కోరగా ఫర్నీచర్ త్వరలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ యూరప్ లాంటి దేశాల్లో మాతృభాషను ప్రోత్సహిస్తున్నారని, మన రాష్ట్రంలో తెలుగు విద్యార్థులు ఇంగ్లీషులో చదువుకోవడానికి కొంత ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉన్నత చదువులకు వెళ్ళాక ఇంగ్లీషు అవసరం అన్నారు. అనంతరం మంత్రి నారా లోకేష్ స్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం 70 మాత్రమే వుండటానికి కారణం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. పాఠశాలలకు రవాణా సౌకర్యం మెరుగు పడాల్సి వుందని ఉపాధ్యాయులు మంత్రికి తెలిపారు. గతంలో ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల బాధ్యతలు అప్పగించి తీవ్రంగా అవమానించడం బాధాకరమన్నారు. కలసికట్టుగా ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దుతామని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 55 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతుంటే 45 శాంత విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. ఇకపై ట్యాబ్స్‌కు బదులుగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్ అభివృద్ధి చేసే అంశంను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## ఇది మంచి ప్రభుత్వం

### - పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇది మంచి ప్రభుత్వం అని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. బంగారుపాళ్యం మండలం ఎన్.కోటూరులో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయ్యిందని, ఈ వంద రోజుల్లో ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని ప్రతి గడపకు వెళ్ళి వివరించాలని పిలుపునిచ్చారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై ప్రజలకు ప్రభుత్వం చేసిన పనులను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, పలమనేరు



ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పీలేరు ఎమ్మెల్యే నల్లారి

## పట్టుబడిన చౌక బియ్యం లారీలు

తడ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త తడ మండలం అక్కంపేట వద్ద పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు కలిసి రెండు అక్రమ బియ్యం లారీలను పట్టుకు న్నారు. ఇందులో 41 టన్నుల కన్నా ఎక్కువ బరువు ఉన్న చౌక బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పేదల కోసం రేషన్ షాపులకు చేరాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. స్థానిక ఎస్ఐ కొండప్పనాయుడు, సివిల్ సప్లయిస్ డిటి ఓబయ్య ఈ దాడుల్లో పాల్గొన్నారు. లారీ డ్రైవర్లు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన బియ్యం లారీలను స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఈ రవాణా చేస్తున్న వారు ముగ్గురు స్మగ్లర్లుగా ప్రాథమిక పరిశీలనలో తేలినట్లు చెప్పారు.

## తిరుమల లడ్డుకు నాశికరం వాడిన వారిపై చర్య తీసుకోవాలి

### ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునయ్య

వెంకటగిరి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతి తిరుమల దేవస్థానంలో శ్రీవారు లడ్డు ప్రసాదములు తయారీలో నాసిరకమైన పదార్థాలను ఉపయోగించిన సంఘ టనపై చర్యలు తీసుకోవాలని ఏపి ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునయ్య కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో గడిచిన ఐదు సంవత్సరాలలో అక్కడ పాలక మండలి సంబంధిత అధికార యంత్రాంగం శ్రీవారి లడ్డు ప్రసాదాలు తయారులో నాసిరకమైన కల్తీ నూనెలులతో తయారు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ లేబరేటరీ నివేదికని బయటపడడం జరిగింది. ఇలాంటి వాటికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు.

## పరిశుభ్ర సమాజ ఆవిష్కరణ లక్ష్యంగా విధులు

పాలసముద్రం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:



పరిశుభ్ర సమాజ ఆవిష్కరణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వర్తించాలని ఇఓఆర్డీ రమేష్ పిలుపు నిచ్చారు. వనదుర్గాపురం పంచాయతీలో ఇఓఆర్డీ రమేష్ ఆధ్వర్యంలో గ్రామ కార్యద ర్శులు రెండు రోజులుగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించి పంచా యితీని పరిశుభ్రం చేశారు. ఈ విష యంపై ఇఓఆర్డీ రమేష్ మాట్లాడుతూ నిరంతరం ఇదే తరహాలో పంచాయతీ వుండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామంలో దోమలు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసు కుంటున్నామని, నీటి నిల్వ వున్న ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేసి దోమ లార్వాలను నాశనం చేస్తున్నామని, అలాగే మురికి నీటిలో మాలథిన్ బాల్స్ వేసి దోమలను కట్టడి చేస్తున్నామన్నారు. ఇదే తరహాలో వనదుర్గాపురం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు చర్యలు తీసుకుంటామని ఇఓఆర్డీ రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహరాజు, కార్యదర్శులు సత్యనారాయణ, సుధాకర్, ధరణి, జయశంకర్, వంశీ, రాజీవ్, ఇంజనీర్ అసిస్టెంట్ జయరాజ్, వేల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, డిజిటల్ అసిస్టెంట్ మనీష్, మహిళా పోలీస్ సరిత, ఎఎన్ఎం కమల, స్వచ్ఛభారత్ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూలోనే కాదు.....

# వడ, పులిహోర, పొంగల్.. అన్నింటా నాణ్యతాలోపం

### -బోడే రామచంద్ర



పుంగనూరు, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : తిరుమల లడ్డూలోనే కాదు, తిరుమల స్వామివారికి నివేదించే పులిహోరా, పొంగల్, జిలేబి,దోస వంటి ప్రసాదాలన్నిం టిలోనూ నాణ్యత లోపించిందని, ప్రపంచ ప్రసిద్ధచెందిన లడ్డూతయారీలో జంతువుల కొవ్వు,ఫిష్ ఆయిల మిశ్రమాలను వినియో గించారని,ఇంతటి సరిదిద్దుకోలేని తప్పిదానికి బాధ్యలైన వారిని కఠినంగా శిక్షించాలని బిసివై రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం ఇంతటి తప్పిదాలకు తెరలేపిందన్నారు. అవినీతి పరుడైన ధర్మారెడ్డిని ఇవో చేసి ఆయనచేత పాలక మండలి ఛైర్మన్ వైవిసుబ్బారెడ్డి నేతృత్వంలో సాక్షాత్తు కలియుగ దైవం శ్రీవారి ప్రసాదాలనే కల్తీ చేయడానికి సాహసించారన్నారు. లడ్డూలో జంతు కొవ్వు,చేపనూనె ఉందని రిపోర్టు వచ్చి రెండునెలలలైనా ఈవిషయాన్ని గోప్యంగా ఉంచడం దారుణమన్నారు.

## వంద రోజుల్లో టిడిపి ప్రజారంజక పాలన

### ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :



కేవలం వంద రోజుల్లోనే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజా రంజక పాలన సాగించిందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. రాష్ట్ర ప్రజలు గత వైసిపి అరాచక పాలనతో ప్రస్తుత టిడిపి పాలన పోల్చుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మునుపటి కంటే ఉత్సాహంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలోని నాల్గో వార్డులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసం గించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వైసిపి ప్రభుత్వ దుర్మార్గపు ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు తమ ఆస్తులపై గూడుకట్టుకున్న భయాన్ని, ఆందోళనను తొలగించారని తెలిపారు. పెన్షన్ల మొత్తాన్ని ఒక వెయ్యి రూపాయలు పెంచి మొదటి నెల ఒక్కొక్కరికి రూ. 7000 వేలు చొప్పున ఒకే రోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ. 4,408 వేల కోట్లు పంపిణీ చేయడం దేశ చరిత్రలో ఒక తిరుగులేని సంక్షేమ చరిత్ర అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు గంజి మాధవ య్య, డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), డి.ఎస్.గణేష్, పట్టణ టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, బిసి సెల్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశక్తి పీఠం చేరుకున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: వారణి మహాక్షేత్రం చాతుర్మాస దీక్షను ద్విగ్విజయంగా పూర్తి చేసుకుని కుర్తాళం పీఠాధిపతి పరమాచార్యులు శ్రీసిద్ధేశ్వరానంద, మంత్ర మహేశ్వరి, రమ్యానంద భారతి శుక్రవారం రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంకు చేరుకున్నారు. అంతకుముందు విమానంలో రేణి గుంటకు చేరుకున్న స్వామి వారికి భక్తులు ఘన స్వాగతం పలికారు. శ్రీశక్తి పీఠంలో 9 రోజుల పాటు నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం నిర్వాహకులు తెలిపారు.

## మంత్రి సత్య కుమార్‌కి స్వాగతం పలికిన బిజేపి నాయకులు



తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కి బిజేపి తిరుపతి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపినాథ్ రెడ్డి, బిజేపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, భాస్కర్ మల్లారపు రవి ప్రసాద్ రాజశేఖర్ రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, మురళి పనిభూషణ రెడ్డి, జనార్ధన్ రెడ్డి కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క బిజేపి కార్యకర్త, నాయకుడు తిరుపతిలో బిజేపి సభ్యత్వాన్ని వేగవంతం చేసి ఎక్కువ సభ్యుల్ని తిరుపతిలో చేర్చే విధంగా పనిచేయాలని సూచించారు.

## నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ పథకం ప్రారంభమై ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వార్ధా పట్టణం, మహారాష్ట్ర నుండి దేశ ప్రధాని నరేంద్ర మోడీజీ వర్చువల్ విధానంలలో అన్ని రాష్ట్రాలలోని పలు జిల్లాలతో అనుసంధానమై సందేశాన్ని అందించారు. ఈ నేపథ్యంలో ఏపీ ఎంఎస్ఎంఈ, న్యాక్, నైపుణ్య అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత అధికారులతో కలిసి హాజరై తమ అమూల్యమైన సందేశం అందించారు.

## పదిలక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త కుప్పం పట్టణంకు చెందిన సామాజిక కార్యకర్త మునిరాజుబాబు(మునస్వామి) కుటుంబానికి ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్)కింద పది లక్షల రూపాయల చెక్కును అందించారు. ఇటీవల మునిరాజుబాబు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఇంకా అతను కోలుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అతని ఆరోగ్యస్థితిపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ చొరవ చూపి సిఎంఆర్ఎఫ్ కింద పదిలక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మునిరాజుబాబు త్వరగా కోలువాలని ఆకాంక్షించారు.

## నారా లోకేష్‌కు ఘనంగా వీడ్కోలు

### జగన్మోహన్‌రెడ్డిపై నిప్పులు చెలరేగిన నారా లోకేష్



రేణిగుంట, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: రాష్ట్ర ఐటీ, ఎల్రక్టానిక్ కమ్యూనికేషన్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు లభించింది. చిత్తూరు జిల్లా పర్యటన ముగించుకుని రోడ్డు మార్గంలో భారీ భద్రత నడుమ శుక్రవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, తిరుపతి జిల్లా ఎస్పీఎల్ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, అదనపు ఎస్పీ నాగభూషణం రావు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఎస్‌డీసీ ప్రోటోకాల్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, రేణిగుంట తహసీల్దార్ సురేష్‌బాబు, టీడీపీ జిల్లా యువ నేత శ్రీధర్‌వర్మ, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి, జిల్లా టీడీపీ నాయకులు నరసింహ యాదవ్ తదితరులు వీడ్కోలు పలికారు. అంతకు ముందు లోకేష్ విమానాశ్రయం వెలుపల తెలుగుదేశం పార్టీ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలను ఆత్మీయంగా చిరునవ్వుతో పలకరించారు. ఎయిర్‌పోర్టు పోర్టికోలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఫేక్ అని అభివర్ణిస్తూ నిప్పులు చెరిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల హృదయాల్లో ఉన్నారన్నారు. విజయవాడ వరదల్లో ముఖ్యమంత్రి చేసిన సేవలను ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌కు 400 కోట్లురావడం ఆయన నిజాయితీకి నిదర్శనమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మెగా డీఎస్సీ, పెన్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం లాగా పింక్ డైమండ్ రాజకీయం చేయలేదన్నారు. అతి త్వరలో గత ప్రభుత్వం చేసిన మద్యం కుంభకోణం బయటకు వస్తుందన్నారు. విలేకరులతో మాట్లాడిన అనంతరం ఆయన విమానంలో బయలుదేరి వెళ్లారు.

## మంత్రి లోకేష్‌కు కాణిపాకం ఆలయ ప్రసాదాల అందజేత



కాణిపాకం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: బంగారుపాళ్యం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎల్రక్టానిక్ కమ్యూనికేషన్ శాఖమంత్రి నారా లోకేష్‌ను కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం నిమిత్తం బంగారుపాళ్యంకు విచ్చేసిన మంత్రి లోకేష్‌ను ఆయన బస చేసిన కళ్యాణమండపంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, కాణిపాకం ఆలయ ఈఓ పెట్టెం గురుప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలసి వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూదన్‌రావు, ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం. పేదల ప్రభుత్వం

### - గూడూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎల్లసిరి నాగార్జున



చిట్టమూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త చిట్టమూరు మండలం ఈశ్వరవాక పంచాయతీ పరిధిలోని దళిత కాలనీలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు గణపర్తి కిషోర్‌నాయుడు సూచనల మేరకు పంచాయతీ టీడీపీ నాయకులతో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎల్లసిరి నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని కొనియాడారు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసినప్పుడల్లా నియోజకవర్గానికి కావలసిన వాటన్నిటి వివరాలను అందించడం ప్రజలకు సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడానికి కష్టపడే నాయకుడు సునీల్‌కుమార్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టిడిపి యువ నాయకులు రవి, రమణయ్య, బాషా, స్థానికులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌తో భేటీ



కోట, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంద రోజుల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటం చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నట్లు తెలిసింది.

## ప్రేమ తెచ్చిన విషాదం..

### - ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని యువకుడు ఆత్మహత్య !!



కుప్పం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త తాను ప్రేమించిన యువతితో వివాహం చేసేందుకు పెద్దలు అంగీకరించ లేదనే కారణంతో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటనకు సంబంధించి రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం యామిగానిపల్లికి చెందిన మునిరాజు కుమారుడు అశోక్ (24) ఓ యువతిని ప్రేమించాడన్నారు. అయితే ఆ యువతితో అతనికి వివాహం చేసేందుకు పెద్దలు అంగీకరించక పోవడంతో శుక్రవారం ఉదయం మున్సిపల్ పరిధి పలవరగానిమిట్ట ప్రాం తంలో రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన

గుడుపల్లి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం రైతులు గుడుపల్లి సబ్‌స్టే షన్ ఎదుట నిరసనకు దిగారు. మండలంలోని గుడుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులు తమకు సక్రమంగా రైతులకు కరెంటు ఇవ్వడంలేదని పేర్కొన్నారు. ప్రక్కన ఉన్న సబ్‌స్టేషన్‌లలో కరెంటు 7 గంటలు నిరంతరాయంగా ఇస్తున్నా గుడుపల్లి సబ్‌స్టేషన్ మాత్రం ప్రతిరోజూ 2 నుండి 3 గంటలు రైతులకు ఇచ్చే మోటరు కరెంటు కట్‌చేస్తున్నారని వాపోయారు. పంటలు ఎండిపోతున్నాయని వారు వాపోయారు. సబ్‌స్టేషన్ ఎదుట నిరసనకు వచ్చిన రైతులకు అధికారులు స్పందించక పోవడంతో వారు వెను తిరిగారు. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు సరైన కరెంటు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

పెనుమూరు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సచివాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు కట్టుబడి వుండాలని, వ్యక్తిగత పరిశుభ్రత. పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా వుండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇ.ప్రభుకిరణ్, డిజిటల్ ఆపరేటర్ బాలాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చియ్యవరంలో రెండో రోజు కొనసాగిన విచారణ

.తొట్టంబేడు, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త వెలుగులో అవినీతి చీకట్లు అన్నశీర్షికన వార్త ప్రచురితం కావడంతో గత రెండు రోజుల నుంచి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 11మంది బృందంతో ప్రత్యేక బృందం విచారణ చేపట్టనుంది శుక్రవారం ఎల్‌సి సిసి పి.గరటారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో విచారణ చేపట్టారు. శుక్రవారం విచారణకు వెళ్ళిన బృందం అధికారులను కలసి వారి వద్ద ఉన్న కాగితాలు చూపించగా వారు విచారణ చేసి నిజమా?కాదా అని సంతకాలు పెట్టమంటే కొందరు వారి వద్ద ఉన్న కాగితాలు చించివేశారు అయితే శుక్రవారం ఎల్‌సి సిసి పి.గరటారెడ్డి చేపట్టిన విచారణలో పది సంఘాలను విచారించారు. విఓ లీడర్లకు సర్దిచెప్పి నివేదికలమీద సంతకాలు ఎట్టకేలకు పెట్టించుకున్నారు. చియ్యవరం గ్రామంలో పూర్తయిన విచారణ తర్వాత గుండేలిగుంట, చోడవరం, కాసరంలో చేపట్టే విచారణ సజావుగా జరగాలంటే మండల పరిషత్ కార్యాలయంలో ఉండే వెలుగు కార్యాలయంలో ఒక్కొక్క సంఘంను విచారణ చేస్తే బాగుంటుంది.

# మళ్లీ రగులుతున్న తొండమనాడు చెరువు చేపల వివాదం

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మండలం తొండమనాడుచెరువులో చేపల పెంపకం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద పాట దారులు హాజరైన సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో లేకపోవటంతో పాట నిర్వహించలేదు. ఈ చెరువులో చేపల పెంపకానికి సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా వెంకటాపురం గ్రామానికి చెందిన రైతులతో వివాదం చోటు చేసుకుంది. ప్రతి ఏడాది వేలం పాటల సందర్భంగా అర్హత ఉన్న వారికే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టడం కొట్లాడుకోవటం జరుగుతుంది. ఈ నేపథ్యం లో శుక్రవారం వేలం పాటలను చల్లపాళెం సచివాలయం వద్ద నిర్వహించబడుతుందనిఈ నెల 13న మత్స్యశాఖ ప్రకటించింది. ఈ మేరకు రెవెన్యూకార్యాలయంలో వద్ద కూడా ప్రకటించారు. చేపల పెంపకం దారులు సొసైటీలు, అర్హత ఉన్న వారు చేరుకున్నారు. సంబంధిత శాఖ అధికారులు సమయం దాటిపోతున్నప్పటికి పత్తాలేదు. అయితే ఈ వేలం పాటలకు సంబంధించి పంచాయతీ





కార్యదర్శి బాలమురళికి చరవాణి ద్వారా ఎన్ని సార్లు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు. దాంతో ఏం జరుగుతుందో అంతుపట్టని పరిస్థితి చోటు చేసుకుంది. వేలం పాటలు నిర్వహిస్తారా? లేక ఏదైనా గూడుపుఠాని జరుగుతుందా? అనే మీమాంశ చోటు చేసుకుంది. ఈ చెరువు వేలం పాటలు చేపల పెంపకంకు సంబంధించి ప్రతి ఏటా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఆదేశాలను అధికారులు ఆచరిస్తూ నిజమైన పెంపకం దారులకుమత్స్యకారులకు అన్యాయం చేస్తున్నారనే ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే ఈ సారి కూడా తొండమనాడు చెరువులో చేపల పెంపకాన్ని పలుకుబడికే కట్టబెడతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. దాంతో వేలం పాటలకు హాజరైన మత్స్య కారులు చల్లపాళెం సచివాలయం ఎదుట ధర్నాచేసారు.

**ఎంపిడిఓ వివరణ:**

తొండమాన్‌పురం చేపల వేలం పాటలకు సంబంధించిన వివాదాలకు సంబంధించి ఎంపిడిఓ రఫీఖాన్‌ను వివరణ కోరగా శుక్రవారం తొండమాన్‌పురం చెరువులో చేపల పెంపకానికి సంబంధించిన వేలం పాటలు నిర్వహిస్తామని ప్రకటించామని అయితే వేలం పాటలు నిర్వహించాల్సి ఈఓపి ఆర్‌డి ప్రభాకర్‌రావు బంధువులు చనిపోవటంతో ఆయన సెలవు మీద వెళ్ళారని దాంతో వేలం పాటలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.